

అందని అత్యవసర వైద్యం

పీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించడంతో రోగులకు అత్యవసర వైద్యం కూడా అందడం లేదు. 'సాక్షి' విజిట్‌లో పలు అంశాలు వెలుగుచూశాయి.

- 8లో



గంగ ఒడికి గణపయ్య

శ్రీకాకుళం కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణపతి ప్రతిమలను బుధవారం రాత్రి నాగావళి నదిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువత సందడి చేశారు.

ఎంబీఏ, ఎంసీఏల్లో పూర్తి స్థాయి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఉన్నత విద్యా మండలి తుది విడత ఐసెట్ – 2024 ప్రవేశాల వివరాలను మంగళవారం రాత్రి ప్రకటించింది. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏలో 55 సీట్లు, ఎంసీఏలో 44 సీట్లు భర్తీ అయ్యాయి. సీట్లు అలాట్‌మెంట్ చేసుకున్న విద్యార్థులు రిపోర్టు చేసి తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. లేనిపక్షంలో సీటు కోల్పోవాల్సి ఉంటుంది.

సూపర్ సిక్స్ కాదు చంద్రన్న డకౌట్



సూపర్ సిక్స్ ప్రతి గడపకూ చేరాలి..

బాబు సూపర్ 6 పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి. క్యాలెండర్ మేనిఫెస్ట్‌లోని అంశాలను ప్రతి గడపకూ చేరవేయాలి. పలాసలో జరిగిన సభలో సూపర్ సిక్స్ పథకాల వివరణలో నారా లోకేష్ ఫిబ్రవరి 13న ఈనాడు పత్రికలో ప్రచురితమైన వార్త

భృతి ఎప్పుడిస్తారో



తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. అలా ఉద్యోగం ఇవ్వకపోతే చదువుకున్న వారికి నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. – బగాది శ్రావణకుమార్, ఎంఏ, కూర్మనాథపురం, సారవకోట

నిరుద్యోగ భృతి

లబ్ధిదారులు: 7,28,210
పొందాల్సిన లబ్ధి : రూ.218.46 కోట్లు
ఎస్సీ : 66,922, ఎస్టీ : 21,919
బీసీ : 5,68,004
ఓసీ : 58,257
మైనారిటీ : 13,108



అన్నదాత సుఖీభవ

లబ్ధిదారులు: 3,14,212
లబ్ధి పొందాల్సిన మొత్తం: రూ. 628.42 కోట్లు
ఎస్సీ : 28,877
ఎస్టీ : 9,458
బీసీ : 2,45,085
ఓసీ : 25,137
మైనారిటీ : 5,655

అన్నదాతకు ఏటా రూ.20 వేలు సాయం..

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చేంత వరకు యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం. రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేయడంలో పెట్టుబడి భారం తగ్గుతుంది.

మే 4న ఈనాడు పత్రికలో ప్రచురితమైన మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు హామీ..

రైతులకు సాయం తక్షణం ఇవ్వాలి



వ్యవసాయ పెట్టుబడిని రైతులకు తక్షణమే అందజేయాలి. గత ప్రభుత్వంలో జూన్ నెలకే తగిన సాయం అందేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తగిన సాయం అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వం ఇస్తానని చెప్పిన రూ.20వేలు తక్షణమే అందజేసి ఆదుకోవాలి. – వంకల మాధవరావు, అఖిలభారత రైతుకూలీ సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు, పలాస



మహిళల ఆర్థికాభివృద్ధికే సూపర్ సిక్స్..

సూపర్ సిక్స్ పథకాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. 19 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తాం. వారు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తాం. మే 8న ఈనాడులో ప్రచురితమైన ఎంపీ రామ్మోహన్‌నాయుడు హామీలివి..

తల్లికి వందనం..



ఒక ఇంటిలో ఎంత మంది చదువుకుంటున్న పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పేరిట ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు ఊరించారు. ఇప్పుడేమో దీనిపై రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఇదివరకు అమ్మ ఒడి పేరిట వైఎస్ జగన్ రంచనుగా డబ్బులు అందజేయడంతో ఈ ప్రభుత్వం కూడా అలాగే చేస్తుందని అంతా ఆశపడ్డారు. కానీ వారి ఆశలపై కూటమి నేతలు నీళ్లు జల్లుతున్నారు. జిల్లాలో **3,23,019** మంది పిల్లలు ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. అమ్మ ఒడి పేరిట వైఎస్ జగన్ నాలుగు విడతల్లో రూ.**1334.51**కోట్ల మేర అందించారు.

గ్యాస్ వచ్చేనా..



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ అంటూ ఎన్నికల ముందు ఆడపడుచులను ఆశ పెట్టారు. జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్లు కోసం **7, 28, 210**మంది ఆశగా చూస్తున్నారు.

గతి లేని భృతి



నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు భృతి కల్పిస్తామని సూపర్ సిక్స్‌లో అచ్చువేశారు. కానీ గెలిచాక దానిపై కనీసం ప్రకటన కూడా చేయడం లేదు. ఈ పథకం గురించి జిల్లాలో దాదాపు **7,28,210** నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

ఉచితం అన్నారు..



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో 18 ఏళ్లు దాటిన మహిళలు **10.95** లక్షల మంది వరకు ఉన్నారు. వీరితో పాటు విద్యార్థినులు **1,19,185** మంది ఉన్నారు. వీరంతా ఉచి త ప్రయాణం ప్రకటన ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

వ్యవ'సాయం' ఏదీ..?



ఖరీఫ్ ప్రారంభంలోనే పీఎం కిసాన్ నిధితో పాటు గత ఐదేళ్లు రైతు భరోసా అన్నదాత చేతికి అందేది. కానీ ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రూపాయి కూడా విదల్చలేదు. మరోవైపు పొలాల్లో పనులు జోరందుకున్నాయి. ఈ సమయంలో పెట్టుబడి సాయం అందితే బాగుంటుందని జిల్లాలోని దాదాపు **3,14,212**మంది రైతులు ఎదురు చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్లలో రూ.**1876.55**కోట్లు అందజేశారు.



తల్లికి వందనం ఎప్పుడిస్తారు..
మా వద్దకు ఇంకా డేటా రాలేదు.
రైతుకు పెట్టుబడి సాయం తేదీ చెప్పలేదు..
ఇంకా ఏమీ అనుకోలేదు.
నిరుద్యోగ భృతి సంగతేంటి..?
అమ్మో.. ఆర్థిక సంక్షోభంలో ఉన్నాం.
మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు..
అన్నామా.. రోడ్ల మ్యాప్‌లవీ పూర్తి చేశాక ఆలోచిద్దాం..
ఆర్టీసీలో ఉచిత ప్రయాణమెప్పుడు..?
కసరత్తు చే....స్తున్నాం..
ఉచిత గ్యాస్..
త్వరలో...

సూపర్ సిక్స్ హామీలపై కూటమి ప్రభుత్వం వద్ద అన్ని సమాధానాలు ఉన్నాయి. కానీ అమలుచేసే ఉద్దేశమే కనిపించడం లేదు. శ్వేత పత్రాలంటూ డేటా అంతా వెలికితీసి అసెంబ్లీలో వల్లె వేస్తున్న ప్రభుత్వానికి పథకం అమలు చేయడానికి మాత్రం అదే డేటా లేకుండా పోయింది. పథకం అమలు దేవుడెరుగు.. కనీసం ప్రకటనైనా వస్తే చాలని లబ్ధిదారుడు ఎదురు చూస్తుంటే.. ప్రభుత్వం మాత్రం వారి మాటే వినబడనట్టు నటిస్తోంది. గత ఐదేళ్ల కాలంలో ఏ లబ్ధిదారుడికీ ఈ అవస్థ ఎదురవలేదు. చెప్పిన తేదీకి చెప్పినట్టుగా లబ్ధి చేకూరేదని అంతా గుర్తు చేసుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

నెలకు రూ.1500



19-60 ఏళ్ల వయసు గల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున అందజేస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టారు. ఇప్పుడు ఆ విషయాన్నే ప్రభుత్వాధినేతలు మర్చిపోయినట్టు ఉన్నారు. వాస్తవానికి ఇది వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం పథకాలకు మారురూపం. కాస్త వయసు పరిమితులు మార్చారంతే. కానీ వైఎస్ జగన్ అమలు చేసినంత నిక్కచ్చిగా కూటమి నేతలు అమలు చేయలేకపోతున్నారు. ఈ పథకం కోసం జిల్లాలో దాదాపు **7,59,692** మంది అర్హులు ఉన్నారు. వైఎస్ జగన్ హయాంలో ఐదేళ్ల కాలంలో మహిళలకు పలు పథకాల రూపంలో రూ.**1345.12**కోట్లు వారి ఖాతాలకు జమ చేశారు.

ఏటా 3 సిలిండర్లు ఉచితం

లబ్ధిదారులు: 7,28,210
లబ్ధి పొందాల్సిన మొత్తం: రూ. 181.21కోట్లు
ఎస్సీ : 66,922
ఎస్టీ : 21,919
బీసీ : 5,68,004 ఓసీ : 58,257
మైనారిటీ : 13108

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

లబ్ధిదారులు: 10.95 లక్షలు
ఎస్సీ : 1,00,672
ఎస్టీ: 32,685
బీసీ : 8,54,251
ఓసీ : 87,630
మైనారిటీ : 19,722

గ్యాస్ సిలిండర్లు అందించాలి..



ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. ఆ గ్యాస్ సిలిండర్లు ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలి. – యు.లక్ష్మి, టెక్కలి

ఉచిత ప్రయాణం మాటే లేదు



ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా ఆ మాటే లేదు.

– బొమ్మాళి హేమలత, కొత్తూరు

మీరే నా ఆడబిడ్డలు...

మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున అయిదేళ్లలో రూ.90 వేలు ఇస్తాం. ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్లు ఉచితంగా ఇస్తాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.

శ్రీకాకుళంలో నిర్వహించిన మహిళా సభలో చంద్రబాబు హామీలు ఏప్రిల్ 25న ఈనాడు పత్రికలో ప్రచురితమైన వార్త



తల్లికి వందనం

లబ్ధిదారులు: 3,23,019
లబ్ధి పొందాల్సిన మొత్తం: రూ.484.52కోట్లు
ఎస్సీ : 29,693. ఎస్టీ : 9,690
బీసీ: 2,51,970,
ఓసీ : 25,850
మైనారిటీ : 5,816

రూ.1500 ఇవ్వాల్సిందే



మహిళలకు ప్రతి నెలా రూ. 1500 ఇస్తామని చెప్పారు. ఎన్నికల వేళ ప్రతి సభ, సమావేశాల్లోనూ ప్రచారం చేశారు. ఆ పథకం ఎప్పుడు అమలు చేస్తారా అని ఎదురుచూస్తున్నాం. ఇవ్వక పోతే తిరుగుబాటు తప్పదు. – యందవ శ్రీదేవి, ఎంఏ బీఈడీ

మహిళలకు ప్రతి నెలా రూ.1500

లబ్ధిదారులు: 7,59,692
లబ్ధి పొందాల్సిన మొత్తం : రూ.113.95కోట్లు
ఎస్సీ : 69,816
ఎస్టీ: 22,867
బీసీ : 5,92,560, ఓసీ : 60,775
మైనారిటీ : 13,674

- సూపర్ సిక్స్ పథకాలకు చంద్ర గ్రహణం
- పాలనకు 100 రోజులైనా హామీలపై స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- ఆర్థిక సంక్షోభం పేరిట తప్పించుకునే ప్రయత్నం
- ప్రజల్లో వెల్లువెత్తుతున్న అనుమానాలు

సూపర్ సిక్స్ హామీలపై ఎన్నికల ముందు ఊళ్లన్నీ హోరెత్తిపోయేలా చంద్రబాబు, పవన్ కల్యాణ్, అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు ప్రచారం చేశారు. అధికారం చేతికి వచ్చాక అంతా మౌనం పాటిస్తున్నారు. పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని అడిగితే ఆర్థిక సంక్షోభం అని తప్పించుకుంటున్నారు. ఓటు వేసేంత వరకు ఓటరు.. ఓటు వేశాక 'లేటరు' అన్న మంత్రం జపిస్తున్నారు. మాటపై ఎన్నడూ నిలబడని వ్యక్తిగా చంద్రబాబుకు ఘనమైన పేరే ఉంది. ఇప్పుడు దాన్ని సార్థకం చేసేలానే కనిపిస్తున్నారు.

మాట తప్పడం బాబుకు అలవాటే..



- మాట తప్పడం చంద్రబాబుకు అలవాటే. దానికి నిదర్శనాలు ఎన్నో ఉన్నాయి.
- 2014–19 మధ్య కాలంలో ఇంటిలో ఉద్యోగమన్నారు. ఉద్యోగం కల్పించలేకపోతే నెలకి రూ. 2వేలు చొప్పున నిరుద్యోగ భృతి కింద అందజేస్తామన్నారు. కానీ ఏదీ ఇవ్వలేదు.
- రైతులకు రుణమాఫీ చేస్తానని నిలువునా ముంచేశారు.
- డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పి పెట్టుబడి నిధి అని, పసుపు కుంకుమ అని కాలం గడిపేశారు.
- 2015,2016,2017,2018 సంవత్సరాలకు సంబంధించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేశారు.
- శ్రీకాకుళం, నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజీ, జిల్లా కేంద్రంలో ఔటర్ రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ వంటివన్నీ గాలిమాటలేనని తేలిపోయింది.
- ఆమదాలవలసలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. దాని జోలికే పోలేదు.

వైఎస్ జగన్ చేసిన సంక్షేమ కార్యక్రమాలు



- అమ్మ ఒడి పేరిట వైఎస్ జగన్ నాలుగు విడతల్లో రూ.1334.51కోట్ల మేర అందించారు.
- జిల్లాలో 48,271మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.
- జిల్లాలో 2లక్షల 10వేల మందికి రూ. 359.56కోట్ల మేరకు జగనన్న విద్యా దీవెన కింద అందించారు.
- జగనన్న వసతి దీవెన కింద లక్షా 80వేల మందికి రూ. 200కోట్ల మేరకు అందజేశారు.
- జిల్లాలో 9,87,692మంది విద్యార్థులకు రూ. 198.09కోట్లతో నాలుగేళ్లలో జగనన్న విద్యా కానుక అందజేశారు.
- ఏటా లక్షా 94వేల 222మందికి జగనన్న గోరు ముద్ద కింద మంచి పౌష్టికాహారం అందజేశారు.
- నేతన్న నేస్తం కింద 1396 మంది చేనేత కార్మికులకు రూ. 15.26కోట్లతో ప్రతి నెలా రూ. 3వేల పింఛన్ అందజేశారు.
- సున్నా వడ్డీ రాయితీ కింద లక్షా 11వేల 336మంది రైతులకు రూ. 32.54కోట్లు సాయం చేశారు.
- లక్షా 10వేల825మంది మహిళలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు సిద్ధం చేశారు. 88వేల మందికి పైగా పట్టాలు పంపిణీ చేశారు.
- ఉచిత పంటల బీమా కింద 48,290 మంది రైతులకు రూ. 643.99కోట్లు పరిహారం చెల్లించారు.
- రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 19,770మందికి రూ. 9.31కోట్ల మేర చెల్లింపులు చేశారు.
- యంత్ర సేవా పథకం కింద 294మంది రైతులకు రూ.14కోట్లతో ట్రాక్టర్లు తదితర అందించారు.
- జగనన్న చేదోడు కింద 15,200మందికి రూ. 55.83కోట్ల మేర ఆర్థిక సాయం చేశారు.
- జగనన్నతోడు కింద 31,488మందికి 128.88కోట్ల సాయం చేశారు.
- వైఎస్సార్ ఆసరా కింద 4,67,232మంది మహిళలకు రూ.1237.78కోట్ల మేర చెల్లింపులు చేశారు.
- వైఎస్సార్ సున్నా వడ్డీ కింద 5,57,866మందికి రూ. 176.38కోట్ల మేర అందించారు
- వైఎస్సార్ కల్యాణ మస్తు కింద 1398మందికి రూ.19.99కోట్లు ప్రోత్సాహకం అందించారు.
- మత్స్యకార భరోసా కింద 18,029 మందికి రూ. 68.74కోట్ల మేర సాయం చేశారు.
- మత్స్యకార డీజిల్ సబ్సిడీని 1718మందికి రూ. కోటి 5లక్షల మేర ఆర్థిక తోడ్పాటు అందించారు.
- వైఎస్సార్ వాహన మిత్ర కింద 14,321మందికి 29.67కోట్లు ఆర్థిక సాయం అందజేశారు.

అనేక పథకాలు అందాయి..



నాకు, నా కుటుంబానికి వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక పథకాలు అందాయి. నాకు రైతు భరోసా నగదు అందింది. నా కుమారుడు బమ్మిడి జయంత్‌కి విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందాయి. పాపకు అమ్మ ఒడి పథకం అందింది. – బమ్మిడి శశి, తాళ్లభద్ర గ్రామం, 05వ వార్డు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

ఏడాదికి రూ.50వేలు అందేది



వైఎస్ జగన్ ఉన్నప్పుడు అన్ని పథకాలు కలిపి ఏడాదికి రూ.50వేలు అందేది. నా ఆయుష్షను కూడా పోసుకుని జగన్ నిండు నూరేళ్లు వర్ధిల్లాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క పథకం కూడా ఇంకా మొదలు కాలేదు. – గూన బైరాగి, మహదేవిపురం, వజ్రపుకొత్తూరు మండలం

ఆశపడి.. మోసపోయి..

బోర్డు తిప్పేసిన ఆన్‌లైన్ యాప్

- అధిక వడ్డీలకు ఆశపడి మోసపోయిన 'ఐఏఎస్' బాధితులు
- బాధితుల ఆందోళనతో వెలుగులోకి వచ్చిన మోసం

శ్రీకాకుళం క్రైమ్ : తమ ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీలు వస్తాయని ఓ సంస్థ నమ్మబలకడంతో జిల్లాకు చెందిన బాధితులు అధిక సంఖ్యలో మోసపోయారు. మంగళవారం రాత్రి బాధితులు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగడంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని సానావీధిలో ఓ బ్యాంకు పై అంతస్తులో ఐఏఎస్(ఇండియన్ అడ్వర్టైజ్‌మెంట్ సర్వీస్) సంస్థ రెండు నెలలుగా కార్యకలాపాలు సాగిస్తోంది. నగరానికి చెందిన కె.అన్నాజీరావు దీనికి మేనేజర్‌గా వ్యవహరించేవారు. ఈయనకు ఐఏఎస్ యాప్ వ్యాలెట్ ద్వారా జీతం కూడా వస్తున్నట్లు తెలుస్తోంది.. ఇందులో కొంతమంది ఏజెంట్లను నియమించి వారి ద్వారా ఖాతాదారులను చేర్పి ఇదే యాప్ వాలెట్ ద్వారా కమీషన్లు కూడా ఇస్తుండేవారు.

ఎలా చెల్లిస్తారంటే..

పెట్టుబడి పెట్టే ఖాతాదారుల ఫోన్‌కు మొదట్లో ఓ లింక్ వస్తుంది. దానిని క్లిక్ చేస్తే అందులో మన చిరునామా, ఆధార్ వివరాలు పొందుపర్చాలని చూపిస్తుంది. వెంటనే ఎంత పెట్టుబడి పెడితే ఎంత రిటర్న్ వస్తుందన్న వివరాలు కనిపిస్తాయి. రోజుకు ఒక విత్‌డ్రా అవుతుందని, దానికి పది శాతం సర్వీస్ ఛార్జి పోను మిగతా వస్తుందని డిపాజిటర్లు చెబుతున్నారు. ఈ ప్లాన్ స్లాట్‌లు ఎలా ఉంటాయంటే రూ. 2,100 పెడితే రోజుకు రూ. 75 చొప్పున ఏడాదికి రూ.22,500లు, రూ. 5,500 పెడితే రోజుకు రూ. 200 చొప్పున ఏడాదికి రూ.60,000లు, రూ. 18,300 పెడితే రోజుకు రూ. 600 చొప్పున ఏడాదికి రూ. 1.98 లక్షలు వస్తుందని ఏజెంట్ల ద్వారా సంస్థ ఖాతాదారులకు నమ్మించారు.



ఐఏఎస్ కార్యాలయం

ఖాతాదారుల సొమ్మునే..

ఆ విధంగా ఖాతాదారుల నుంచి జమ చేసిన సొమ్మును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి వారంలో ఐదురోజులకు వచ్చే లాభాలను ఐఏఎస్ వ్యాలెట్ ద్వారా ప్రతీ వారం ఖాతాదారులకు చెల్లిస్తుంటారని ఏజెంట్లు చెబుతున్నారు. వారం చివరి రోజులో వచ్చే రిటర్న్స్ ఖాతాదారు విత్‌డ్రా చేసుకోపోతే అది వెనక్కి వెళ్లిపోయే పరిస్థితి ఉంటుంది.



ధ్వంసమైన కార్యాలయం

విత్‌డ్రాలు నిలిచిపోవడంతో..

మంగళవారం కార్యాలయంలో సామగ్రి షిఫ్ట్ చేస్తుండటంతో చుట్టు పక్కల ప్రాంతాల డిపాజిటర్లు చేరారు. అప్పటికే తమ రిటర్న్స్ విత్‌డ్రాలు రాకపోవడంతో కార్యాలయం లోపలకు చొరబడి ఆందోళన చేశారు. ఎవరూ లేకపోవడంతో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి దొరికిన వస్తువులను దొరికినట్లు పట్టుకుపోయారు.

కాగా, ఈ సంస్థ పేరు చెప్పి కొంతమంది వ్యక్తులు దుర్వినియోగం చేసినట్లు అందులో పనిచేస్తున్న ఇక్కడి ఏజెంట్లు చెబుతుండటం గమనార్హం. దీనిపై రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు వద్ద ప్రస్తావించగా తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని చెబుతున్నారు.

క్లుప్తంగా

28న ఐటీఐ కౌన్సెలింగ్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో మిగులు సీట్ల భర్తీకి 4వ ఫేజ్‌లో దరఖాస్తుకునే అభ్యర్థులకు ఈ నెల 28న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్‌రావు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇప్పటికే మూడు విడతలు పూర్తి కాగా.. తాజాగా నాలుగో విడత ప్రవేశాలకు ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 27లోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై సరిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 28న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. శ్రీకాకుళం డీఎల్‌టీసీలో కేంద్రంలో మహిళలకు సూయింగ్ టెక్నాలజీ(టైలరింగ్ శిక్షణ) కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రార్‌ను కలిసిన ట్రిపుల్ ఐటీ అధికారులు



అమరేంద్రకుమార్‌ను అభినందిస్తున్న శ్రీకాకుళం క్యాంపస్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. నూజివీడు వెళ్లిన పరిపాలన అధికారి ముని రామకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో నిర్వహిస్తున్న క్లాస్‌వర్కు, పాలన, చేపడుతున్న అభివృద్ధి పనులను రిజిస్ట్రార్‌కు వివరించారు.

ఐటెప్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: నాలుగేళ్ల సమీకృత డిగ్రీ కోర్సు (ఐటీఈపీ)లో మొదటి విడత సీట్లు ఎలాట్‌మెంట్‌ను వర్సిటీ అధికారులు బుధవారం ప్రకటించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించారు. నాలుగేళ్ల బీఏబీఎడ్ కోర్సుల్లో 50 సీట్లు ఉండగా మూడు సీట్లు కేటాయించారు. బీఎస్సీ బీఎడ్‌లో 50 సీట్లు ఉండగా, 25 ప్రవేశాలు కల్పించారు. సీట్లు కేటాయించిన విద్యార్థులు 20వ తేదీలోపు బీఏకు రూ.15000, బీఎస్సీకి రూ.18000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి రెండో విడతలో సీట్లు కేటాయిస్తారు.

- కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల నిరసన
- సేవలందక వెనుదిరిగిన వందలాది మంది రోగులు
- 'సాక్షి' విజిట్‌లో పలు అంశాలు వెలుగులోకి..



కొత్తూరు మండలం కురిగాం పీహెచ్‌సీలో డాక్టర్‌కు బదులుగా సిబ్బందే మందులు అందిస్తున్న వైనం

అందని అత్యవసర వైద్యం

సిబ్బందే దిక్కు

సారవకోట బొంతు పీహెచ్‌సీలో ఇద్దరు చొప్పున వైద్యులుండేవారు. ప్రస్తుతం వీరు సమ్మెలో ఉండటంతో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలే వైద్య సేవలందిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ల్యాబ్‌టెక్నీషియన్ హరి రోగులకు సెలైన్‌బాటిల్ పెడుతున్నారు.



సారవకోట పీహెచ్‌సీలో సెలైన్‌బాటిల్ పెడుతున్న ల్యాబ్ టెక్నీషియన్ హరి

అరసవల్లి: పీజీ సీట్ల కుదింపు జీఓ 85 రద్దు కోరుతూ ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల నిరసనల స్థాయి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ ప్రభావం గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత రోగులపై పడుతోంది. ప్రధానంగా అత్యవసర వైద్యం గ్రామీణ రోగులకు అందకుండా పోతోంది. ఈ నెల 10 నుంచి పీహెచ్‌సీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టగా.. ముందుగా ఈ నెల 14 నుంచి ఓపీ సేవలను నిలిపివేశారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మెట్టు దిగకపోవడంతో ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు కూడా బంద్ చేసి విజయవాడలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో జిల్లాలో ఉన్న 71 పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి.

పీహెచ్‌సీల్లో పడిగాపులు..

జిల్లాలో మొత్తం 71 పీహెచ్‌సిల్లో బుధవారం 'సాక్షి' బృందం ప్రత్యేకంగా పరిశీలన చేపట్టింది. అధికారికంగా ఓపీ కేసులు 3470 కాగా.. ఎమర్జెన్సీ కేసులు 44 వరకు నమోదయ్యాయని జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ అధ్యక్షులు డాక్టర్ ఎం.సందీప్ ప్రకటించారు.

- గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో పీహెచ్‌సీల్లో వైద్యులెవ్వరూ హాజరుకాలేదు. జ్వర పీడితులు, డెంగీ అనుమానితులు అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారు పీహెచ్‌సీల వద్ద పడిగాపులు కాశారు.
- ఉదయం 10.30 గంటల నుంచే పెద్ద సంఖ్యలో బాధితులు చేరుకున్నారు. అయితే ఓపీ సేవలు, అత్యవసర సేవలు నిలిపివేయబడ్డాయంటూ కరపత్రాలను ద్వారాలకు అంటించడంతో రోగులకు నిరాశ తప్పలేదు. డాక్టర్లు స్ట్రైక్‌లో ఉన్నారంటూ అక్కడి సిబ్బంది రోగులకు చెప్పి పంపించేయడం కనిపించింది.
- సమాచారం తెలుసుకున్న రోగుల్లో కొందరు వ్యయప్రయాసలకు లోనై ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీశారు. మరికొందరు స్థానిక ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ల వైద్యం కోసం వెళ్లడం కనిపించింది.
- పీహెచ్‌సీల్లో పరిస్థితులపై జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ అధ్యక్షుడు డాక్టర్ సందీప్ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా..ప్రభుత్వం దిగొచ్చి జీఓ 85ని రద్దు చేసి పీజీ సీట్ల కోటాను యధావిధిగా కొనసాగించేలా నిర్ణయాన్ని ప్రకటించినంతవరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

డాక్టర్లు లేరు



వైద్యం కోసం ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రికి వస్తాను. డాక్టర్లు పరీక్షలు చేసి మందులు ఇస్తారు. వాటితోనే నా అనారోగ్యం కుదుటపడుతుంది. ఇప్పుడు ఆస్పత్రికి వచ్చినా డాక్టర్లు ఇద్దరూ లేరు. ఇక్కడ ఉన్న వారు నా పరిస్థితిని తెలుసుకుని మందులు ఇచ్చారు. డాక్టర్లు లేకపోవటంతో ఇబ్బందిగానే అనిపించింది.

– తాడిన అప్పమ్మ, వృద్ధురాలు, లక్ష్మీనర్సుపేట, ఎల్.ఎన్.పేట

చక్రధర్ మృతికి సంతాపం



చక్రధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రముఖ విద్యావేత్త, చక్రధర్ ఐఐటీ విద్యాసంస్థల అధినేత యాల్ల చంద్రశేఖర్ మృతి బాధాకరమని పలు విద్యాసంస్థల యజమానులు విచారం వ్యక్తం చేశారు. జిల్లాలో ఎంతోమంది విద్యార్థులు ఐఐటీ, నీట్ మెడిసిన్‌లో సీట్లు సాధించేందుకు కృషి చేశారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

పారా త్రోబాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ స్థాయి పారా త్రోబాల్ పోటీలకు ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంకు చెందిన దోని లక్ష్మణరావు, శ్రీకాకుళం పట్టణం దమ్మల వీధికి చెందిన మాడుపల్లి అప్పారావు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 21 నుంచి 23 వరకు జార్ఖండ్‌లో జరిగే పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రాష్ట్రం నుంచి 11 మందిని ఎంపిక చేయగా అందులో మన జిల్లా నుంచి వీరికి అవకాశం లభించింది.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు కొసమాల యువకుడు



స్వర్ణ పతకంతో పూర్ణచంద్ర

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామానికి చెందిన బూరగాపు పూర్ణచంద్ర జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14న తెలంగాణ రాష్ట్రం నల్గొండలో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించాడు. దీంతో వచ్చే నెల ఆరు నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న సీబీఎస్ నేషనల్ క్రీడాపోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పూర్ణచంద్రను కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్ : బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. చాపురం పంచాయతీ పరిధిలో నివసిస్తున్న 17 ఏళ్ల బాలికతో గంజాం జిల్లా చీడిపూడి గ్రామానికి చెందిన సాహుకారి కృష్ణ అనే వ్యక్తి రెండేళ్ల క్రితం దగ్గరి బంధువు శుభకార్యంలో పరిచయం ఏర్పర్చుకున్నాడు. ఇతను జేసీబీ ఆపరేటర్ కావడంతో వృత్తిరీత్యా పైడిభీమవరంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసం చేశాడు. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో వారు పెదపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. రూరల్ ఏఎస్‌ఐ నారాయణ కేసు నమోదు చేయగా శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద విచారణ చేపట్టారు.

పీఎంశ్రీ వర్క్‌షాప్‌నకు కురుడు హైస్కూల్ టీచర్ ఎంపిక

కోటబొమ్మాళి: కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విజయవాడ గన్నవరంలో బుధవారం జరిగిన పీఎంశ్రీ వర్క్‌షాప్‌కు కోటబొమ్మాళి మండలం కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆహ్వానం అందింది. రాష్ట్రవ్యాప్తంగా 100 హైస్కూళ్లను ఎంపిక చేయగా.. అందులో శ్రీకాకుళం జిల్లాలో నాలుగు సెలక్టయ్యాయి. అందులో వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు కురుడు హైస్కూల్ తరఫున సోషల్ స్టడీస్ టీచర్ కరిమి రాజేశ్వరరావు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్, డిజైన్, ఇంటర్న్‌షిప్, స్టూడెంట్ స్కిల్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్' కార్యక్రమం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వినతుల స్వీకరణ ఉంటుందని, విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటనపై హర్షం

శ్రీకాకుళం: దేశం కోసం సరిహద్దులో ఎన్నో క్లిష్టమైన పరిస్థితుల్లో సేవలందిస్తున్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కేంద్రపౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ కేబినేట్ బుధవారం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. సిక్కోలు జిల్లాకు చెందిన మాజీ సైనిక సంఘం (16 విభాగాలు)తో ఈ నెల 15న నిర్వహించిన ప్రత్యేక భేటీలో సైతం ప్రత్యేక కార్పొరేషన్ పట్ల స్పష్టమైన హామీ ఇచ్చామని గుర్తు చేశారు.

శ్రీకాకుళం న్యూకాలనీ / క్రైమ్ : మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపడంపై జిల్లా మాజీ సైనికోద్యోగుల సంఘ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా కృష్ణకుమారి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా జి.కృష్ణకుమారిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈమె సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై రానున్నారు. ఇప్పటివరకు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేసిన కిల్లి మన్మధరావు విశాఖపట్నం జిల్లా రిజిస్ట్రార్ (ఎంవీ అండ్ ఏ)కు బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అలికాం-బత్తిలి (ఏబీ) రోడ్డుకు పక్కనే ఉన్న పెద్దకొల్లివలస పునారావాస కాలనీలోని ప్రారంభం కాని గ్రామ సచివాలయం భవనం వద్ద ఇసుక నిల్వచేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దారు వై.వి.పద్మావతి, డీటీ రషీద్ అహ్మద్, ఆర్ఐ గవరయ్య, సిబ్బంది ఇసుకను పరిశీలించారు. సిబ్బంది నుంచి సమాధానం రాకపోవటంతో ఇసుక సీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పరిస్థితిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకుని వెళతామని, అప్పటి వరకు ఇసుక తరలించకుండా పరిశీలించాలని వీఆర్వో, వీఆర్ఏలకు అప్పగించారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ఇసుకతో ఉన్న లారీని ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. కల్లేపల్లి సమీప ఏరు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక లోడుతో వస్తున్న లారీని పీఎస్ఆర్ కూడలి వచ్చేసరికి ఎస్ఐ, సిబ్బంది పట్టుకున్నారు. చిలకపాలెంకు చెందిన యజమాని కల్లేపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

టార్గెట్ల పేరుతో వేధించడం సరికాదు



నిరసన తెలియజేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా శాఖ ఉద్యోగులకు టార్గెట్ల పేరుతో అధికారులు వేధింపులకు గురిచేయడం సరికాదని ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా తపాలా శాఖ అధికారులు చేస్తున్న వేధింపులకు వ్యతిరేకంగా బుధవారం శ్రీకాకుళం తపాలాశాఖ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో టార్గెట్లు పేరుతో అధికారులు చేస్తున్న వేధింపులు వర్ణనాతీతమన్నారు. చాలా మంది డివిజనల్/సబ్ డివిజన్ అధికారులు దుర్భాషలాడటం, సెలవులు మంజూరు చేయకుండా నియంతల్లా వ్యవహరిస్తున్నారని వాపోయారు. మౌలిక వసతులు కల్పించకుండా అదనపు భారం పెడుతున్నారని మండిపడ్డారు. టార్గెట్స్ పేరుతో ఉద్యోగులను ఒత్తిడి చేయకూడదని డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చినా వాటిని అమలు చేయడంలో కింది స్థాయిలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ యూనియన్ నాయకులు కె.గణపతి, ఎల్.బాబూరావు, వి.శశిభూషణరావు, యు.వి.రమణ, టి.వేంకటేశ్వర్లు, ఎన్.నందికేశ్వరరావు, బి.శ్రీరామ్మూర్తి నాయుడు, అప్పారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో క్రీడాకారుల హవా



సాధించిన పతకాలతో క్రీడాకారులు, చీఫ్ కోచ్ ఢిల్లీ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు హవా కనబర్చారు. శ్రీకాకుళం నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో కెన్యూరియో కరాటే సంస్థ విద్యార్థులు విశాఖపట్నంలో ఈ నెల 15న జరిగిన స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కటా, కుమిటి విభాగాల్లో 22 పతకాలు సాధించారు. 13 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా వివిధ విభాగాల్లో 8 బంగారు, 6 రజత, మరో 8 కాంస్య పతకాలతోపాటు ఓవరాల్ చాంపియన్‌సిప్‌లో తృతీయస్థానం నిలవడం గర్వకారణంగా ఉందని సంస్థ చీఫ్ కోచ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు సంతోషం వ్యక్తంచేశారు. ఏపీ స్టేట్ కరాటే చీఫ్ కె.సుమన్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలను అందుకున్నట్లు పేర్కొన్నారు.

ఫర్నిచర్ షాపులో రూ.25 వేల నగదు చోరీ



వివరాలు సేకరిస్తున్న ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని మెయిన్ రోడ్డులో మూడుషాపుల్లో దొంగతనం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ప్లాస్టిక్ ఫర్నిచర్స్, బ్యాగుల దుకాణం, చెప్పులు అమ్మేషాపుల్లో చొరబడినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫర్నిచర్స్ షాపులో కౌంటర్లో ఉంచిన రూ.25 వేలు సొమ్మును పట్టుకుపోయారు. మిగిలిన రెండు షాపుల్లో పైకప్పుని కట్ చేసి చోరీకి ప్రయత్నం చేసినా ఎటువంటి నష్టం వాటిల్లలేదు. సీసీ కెమెరాల్లో నిందితుడి వివరాలు రికార్డు కావడంతో దాని ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. బాధిత యజమాని కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు.

సరిహద్దులో ప్రత్యేక నిఘా



పైడిభీమవరంలో అంతర జిల్లా సరిహద్దును పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రణస్థలం: అంతర జిల్లా సరిహద్దులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. పైడిభీమవరంలో అంతర జిల్లా సరిహద్దు వద్ద బుధవారం పరిస్థితిని పర్యవేక్షించారు. స్థానిక పోలీస్ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. వాహనాలు తనిఖీ ముమ్మరంగా జరగాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని, గంజాయి, ఇసుక రవాణాపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 24 గంటల పాటు ఇక్కడ నిఘా ఉండాలని సూచించారు. అనంతరం జేఆర్‌పురం సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. రోడ్డు భద్రత, హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, ఇమ్మాన్యుయల్ రాజు, ఎస్సై చిరంజీవి ఉన్నారు.

తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈ మేరకు పథకం పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్‌ను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



సోమేశ్వరరావు(ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలోని పల్లిసారధి గ్రామానికి చెందిన పోతనపల్లి సోమేశ్వరరావు(39) కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 11న మందు తాగిన సోమేశ్వరరావును కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమేశ్వరరావు మద్యానికి బానిస కావడంతో భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎస్ఐ బి.నిహార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..

కొత్తూరు: మండలంలోని కుద్దిగాం గ్రామానికి చెందిన సాసుబిల్లి అప్పారావు(60) పురుగుల మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు. భార్య అన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మద్యానికి బానిస కావడంతో అప్పారావు ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండు వారాల్లో వేతనం ఇవ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన బకాయిలకు సంబంధించి బుధవారం అసిస్టెంట్ లేబర్ కమిషన్ విచారణ నిర్వహించారు. లేబర్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ విచారణకు రిజిస్ట్రార్ పి.సుజాత, వర్సిటీ న్యాయ సలహాదారు రామ్మోహన్‌రావు, ఫిర్యాదు చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ కమిషన్ అధికారి మాట్లాడుతూ 89 రోజులు పనిచేయించుకున్నాక తప్పని సరిగా వేతనం చెల్లించాలని స్పష్టం చేశారు. రెండు వారాల్లో వేతనం చెల్లించాలని, అక్టోబర్ 19న మళ్లీ విచారించనున్నట్లు తెలిపారు.